సాక్షి
బాపట్ల
గురువారం, 24, అక్టోబర్, 2024




వైభవంగా కళ్యాణోత్సవం

నగరంపాలెం: స్థానిక బ్రాడిపేట 2/7వ అడ్డ రోడ్డులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,269 క్యూసెక్కులు వస్తోంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 44.38 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 5,009, హై లెవల్ కాలువకు 226, బ్యాంక్ కెనాల్‌కు 1,356 క్యూసెక్కులు వదిలారు.



గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జన సందోహానికి అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సహనా మృతదేహం వద్ద విషణ్ణ వదనంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆడబిడ్డలకు అండ

మహిళల రక్షణలో ప్రభుత్వం ఘోరంగా విఫలం : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అఘాయిత్యాలలో బలైన యువతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పన సాయం

- టీడీపీ గూండాల చేతిలో బలైన సహానా కుటుంబానికి జననేత పరామర్శ
- గుంటూరులో అధినేతకు మద్దతుగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నిందితుడికి టీడీపీతో సంబంధాలు ఉన్నందునే రక్షిస్తున్నారని ఆరోపణ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టీకరణ



సహానా మృతదేహంపై గాయాలను పరిశీలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు, పట్నంబజారు: రాష్ట్రంలో హత్యాచార బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. టీడీపీ గూండాల చేతిలో బలైన ఆడబిడ్డ కుటుంబానికి తానున్నానే భరోసా కల్పించేందుకు బుధవారం గుంటూరు వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ కార్యకర్తలు, ప్రజానీకం, కులసంఘాల నేతలు మద్దతుగా నిలిచారు. ఆడపడుచుకు సోదరుడిగా .. సదరు నిందితులను నిలదీసిన జననేత పక్షాన తామున్నామని గొంతెత్తి చాటారు. గుంటూరు జీజీహెచ్‌లో సహానా మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను వైఎస్ జగన్ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన ఏడు హత్యాచార ఘటనల్లో చంద్రబాబు స్పందించినా లేకపోయినా, తమ పార్టీ నుంచి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. దీంతో పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడు నవీన్ దాడిలో చనిపోయిన తెనాలి యువతి సహానా, రెండు నెలల క్రితం చేబ్రోలులో హత్యకు గురైన శైలజ, వేటపాలెం మండలంలో హత్యకు గురైన సుచరిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరపున రూ. 10 లక్షల వంతున ఆర్థిక సాయం అందనుంది. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన జరుగుతోందని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ వారు ఏ తప్పు చేసినా వెనకేసుకొచ్చేలా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ విధంగా దాడులకు, అత్యాచారాలకు పాల్పడిన వారిని వెతికి మరీ జైళ్లకు పంపుతామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సహానాను పని చేస్తున్న ప్రదేశానికి వచ్చి కారులో నవీన్ ఎక్కించుకెళ్లి ఇంకొందరితో కలిసి వేధించాడని, శారీరకంగా హింసించారని తెలిపారు. ఆమె శరీరమంతా కందిపోయిన గుర్తులు కనిపిస్తున్నాయని, ప్రైవేటు పార్ట్‌లూ విచ్ఛిన్నం చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇక్కడికి తీసుకొచ్చి పడేసి, కుటుంబ సభ్యులు రాగానే జారుకున్నారని తెలిపారు. ఈ విషయాలను పోలీసులు ఎందుకు దాచి పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. నవీన్‌తోపాటు ఉన్న మరో ఇద్దర్ని ఎందుకు అదుపులోకి తీసుకోవడం లేదని వైఎస్ జగన్ మండిపడ్డారు. తాను దళితులకు తోడుగా ఉంటానని, దళితులంతా తమ వారే అని పేర్కొన్నారు. తాను ఈ విషయాన్ని ధైర్యంగా చెబుతానని స్పష్టం చేశారు. పేదలకు తోడుగా ఉన్నామని ప్రభుత్వం చెప్పాలిగానీ, కూటమి సర్కారు మాత్రం ఆ పని చేయడం లేదన్నారు. పైగా తమ పార్టీ వారిని నిందించడం సరైనదేనా? అని నిలదీశారు. సహానా తల్లికి తాము తోడుగా నిలబడితే.. తమపై నిందలు వేయడం సబబా? అంటూ జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన వెంట టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, వరుదు కళ్యాణి, కల్పలతారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, కోన రఘుపతి, నంబూరు శంకరరావు, పార్టీ నగర అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ ఉన్నారు.

జననేతకు మద్దతుగా...

తొలుత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో బుధవారం ఉదయం 10.50 గంటలకు గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అప్పటికే పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా.. ముందుకు సాగారు. గుంటూరు జిల్లా కోర్టు మీదుగా వెళుతూ న్యాయవాదులు అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు. మెడికల్ కళాశాల మీదుగా ఆసుపత్రికి చేరుకున్నారు. వైఎస్ జగన్‌కు మద్దతు తెలిపేందుకు పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, పలు దళిత సంఘాల నేతలు అక్కడకు చేరుకున్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు వైఎస్ జగన్ చేరుకునే సరికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. సహానా మృతి గురించి జీజీహెచ్‌లో వైద్యులతో వైఎస్ జగన్ మాట్లాడారు.



వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

వేధింపులు.. కక్ష సాధింపులు

వైఎస్సార్ సీపీలోని దళితులు, బలహీన వర్గాలే టార్గెట్

- నేతలు, కార్యకర్తలపై ప్రభుత్వం అక్రమ కేసులు
- బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కేసుల పరంపర
- వేమూరులో వరికూటి అశోక్‌బాబుపై కేసులు
- యద్దనపూడిలో ఎస్సీలపై కేసులు, రౌడీషీట్లు
- రేపల్లెలో దళిత నేతలపై దాడులు
- కొనసాగుతున్న టీడీపీ దౌర్జన్యాలు



భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో నిరసన దీక్ష చేస్తున్న వరికూటి అశోక్‌బాబు (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు టార్గెట్‌గా తెలుగుదేశం ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడడంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారు. మిగిలిన వర్గాలతో పాటు ప్రధానంగా బలహీనవర్గాలే లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతున్నాయి. అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తే వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలుస్తున్న బలహీనవర్గాలు భయంతో వెనక్కు తగ్గుతారని పచ్చ నేతలు వ్యూహాత్మకంగా దాడులకు పాల్పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలను టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు. కూటమి సర్కార్ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అశోక్‌బాబుపై అక్రమ కేసులు..

టీడీపీ అధికారంలోకి వచ్చాక వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం అద్దేపల్లి ఎస్సీ కాలనీలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పచ్చపార్టీ వారు పెట్రోల్ పోసి తగులబెట్టారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు కాలనీ వద్దకు చేరుకొని అధికారపార్టీ నేతల తీరును ఖండించారు. కళ్లకు నల్లబ్యాడ్జీ కట్టుకొని నిరసన దీక్షకు దిగారు. ఆయనకు పెద్ద ఎత్తున మద్దతు లభించింది. వేలాదిమంది కార్యకర్తలు మద్దతుగా ఆందోళనకు దిగడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అశోక్‌బాబుతో పాటు పలువురిపై అక్రమ కేసులు నమోదు చేశారు. చివరకు కాల్చిన వైఎస్ విగ్రహం స్థానంలో అశోక్‌బాబు మరొక విగ్రహం ఏర్పాటు చేశారు.

ఎస్సీ నేతలపై రౌడీషీట్లు..

పర్చూరు నియోజకవర్గం యద్దనపూడి మండలానికి చెందిన పలువురు ఎస్సీ నేతలపై పచ్చ ప్రభుత్వం రౌడీషీట్లు ఓపెన్ చేసి కక్షపూరితంగా వ్యవహరించింది. మండలానికి చెందిన పర్చూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు వైఎస్సార్ సీపీలో చురుకై న నేతగా ఉన్నారు. పచ్చపార్టీ ఆధిపత్యం ఉన్న నియోజకవర్గంలో ఎస్సీ సామాజికవర్గాన్ని సమన్వయం చేసి వైఎస్సార్ సీపీకి మద్దతుగా కూడగట్టారు. నియోజకవర్గంలో దళిత వేదిక ఏర్పాటుచేసి ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల సమస్యలపై గళం వినిస్తు వారికి అండగా ఉన్నారు. ఇది జీర్ణించుకోలేని పచ్చ ప్రభుత్వం రాంబాబుతోపాటు ఆయన సామాజికవర్గం వారు ఏడుగురిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి బెదిరింపులకు దిగింది. చురుగ్గా ఉన్న బలహీన వర్గాలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తే వారు వైఎస్సార్ సీపీకి దూరంగా ఉంటారన్నది పచ్చపార్టీ ఎత్తుగడగా ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులకు బలహీన వర్గాలవారు ఏమాత్రం బెదరడంలేదు. ఒకవైపు అక్రమ కేసులు బనాయించడమే కాకుండా మరోవైపు పచ్చనేతలు వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నేతలపై ఏకంగా దాడులకు తెగబడిన సంఘటనలు కోకొల్లలు.

- రేపల్లె నియోజకవర్గం చెరకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంకు చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్ ఇంటిపై దాడిచేసి తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ఇంటిఅద్దాలు ధ్వంసం చేశారు. ఊరు విడిచిపెట్టి వెళ్లాలని బెదిరించారు.
- ఇదే మండలం గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు డ్రైవర్ గాలి సంపత్‌కుమార్ అనే దళితుడిని ఇంటిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అంతు తేలుస్తామంటూ బెదిరించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నేతలు, కార్యకర్తలను పచ్చనేతలు బెదిరించడంతోపాటు దాడులు చేసి కొట్టిన సంఘటనలతోపాటు అక్రమ కేసులు బనాయించిన ఘటనలు అనేకం.

బయటకు రాకుండా నందిగంపై కుట్ర

బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను చంద్రబాబు ప్రభుత్వం టార్గెట్ చేసింది. అతనిపై కేసులు బనాయించి హింసిస్తోంది. సురేష్‌ను జైలుకు పంపిన ప్రభుత్వం మరిన్ని కేసులు పెట్టి బయటకు రాకుండా చేసే కుట్రకు తెరలేపింది. అనారోగ్యంతో ఉన్న ఆయనకు సక్రమంగా వైద్య సేవలు అందించక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగిన నందిగం సురేష్‌పై చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్‌చేసి కూటమి సర్కార్ అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు తెలుస్తోంది.



నందిగం సురేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

కేంద్ర పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూర్చాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్



కేంద్ర బృందం సభ్యులతో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్ జైన్

బాపట్ల: కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేద ప్రజలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కేంద్ర బృందం సభ్యులు ఎస్.శ్రీరామ్, పి.లోహిత్ రెడ్డి బుధవారం కలెక్టరేట్‌కు చేరుకుని జేసీ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రప్రభుత్వ పథకాలు, అమలు, లబ్ధిపై రేపల్లె, వేమూరు, సంతమాగులూరు, చుండూరు మండలాలలో ఈనెల 26వ తేదీవరకు పర్యటిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటన ద్వారా లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటామన్నారు. అధికారులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల పని తీరుపై అనుబంధ శాఖల అధికారులతో స్థానిక జిల్లా సంయుక్త కలెక్టర్ చాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. నిరుపేదలకు లబ్ధి చేకూర్చడానికే కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జేసీ అన్నారు. కేంద్రం వెచ్చిస్తున్న నిధులు అర్హులైన ప్రతి పేదవానికి చేరాలని ఆయన సూచించారు. డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీపీఓ ప్రభాకర్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజుగారిపాలెంలో మొసలి కలకలం

మార్టూరు: మండలంలోని రాజుగారిపాలెంలో బుధవారం వాగులో మొసలి కనిపించటం స్థానికంగా కలకలం రేపింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు దాట్ల శ్రీనివాసరాజు పొలం పనులు చూసుకొని తిరిగి గ్రామ సమీపంలోని వాగు పై ఉన్న చెక్ డ్యాం మీదుగా ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వాగు ఒడ్డున మొసలిని గమనించి సీఐ శేషగిరిరావుకు సమాచారం అందించారు. సీఐద్వారా సమాచారం అందుకున్న కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ గ్రామానికి వెళ్లి చెక్ డ్యాం సమీపంలోని వాగు వద్దకు ఎవరూ వెళ్లవద్దని, గురువారం తమ సిబ్బందితో వచ్చి మొసలి ఆచూకీ గురించి తెలుసుకుంటామని గ్రామంలో చాటింపు వేయించారు.

న్యూస్‌రీల్

నీటి కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి



మృతుడు కాలేషా



అబ్దుల్లా మృతదేహం

అద్దంకి రూరల్: గేదెలను మేపటానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఇద్దరు బాలురు మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం బాపట్ల జిల్లా అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కొటికలపూడి గ్రామానికి చెందిన ఇమ్మానియేలు, కాలేషాలు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇమ్మానియేల్ కుమారుడు కాలేషా (16) మెకానిక్ పని చేస్తుంటాడు. కాలేషా కుమారుడు అబ్దుల్లా (13) మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఇరువురు కలిసి గేదెలను మేపేందుకు సాయంత్రం గ్రామంలో ఉన్న స్మశానం వైపు వెళ్లారు. అక్కడ ఉన్న కుంటలో ప్రమాదవశాత్తు అబ్దుల్లా జారి పడ్డాడు. అబ్దుల్లాను పైకి తీసేందుకు ప్రయత్నించే క్రమంలో కాలేషా కూడా కుంటలో జారి పడ్డారు. అది గమనించిన పశువుల కాపరులు వెళ్లి చూడగా అప్పటికే అబ్దులా చనిపోయాడు. వెంటనే తల్లిదండ్రులకు తెలపటంతో, తల్లిదండ్రులు గ్రామస్తులు వచ్చి కొంతసేపు కుంటలో వెతకడంతో కాలేషా మృతదేహం కనబడింది. సమాచారం అందుకున్న ఎస్ఐ ఖాదర్ బాషా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

చీరాల ప్రభుత్వాసుపత్రి సందర్శన



చీరాల రూరల్: జాతీయ హెల్త్‌మిషన్ బృందం సభ్యులు డాక్టర్ వరుణ్ విజయ్ ఆధ్వర్యంలో బుధవారం చీరాల ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు వైద్యసేవలు ఏవిధంగా అందుతున్నాయనే విషయాలను డాక్టర్ సుభాషిణిని అడిగి తెలుసుకున్నారు. తల్లీబిడ్డల కాన్పుల వార్డులో ఎన్ని బెడ్లు ఉన్నాయి, ఎంత మంది గైనిక్ వైద్యులున్నారు? నెలకు సరాసరి ఎన్ని కాన్పులు జరుగుతున్నాయి అని తెలుసుకున్నారు. వృద్ధులకు అందించే సేవలు, కంటి ఆపరేషన్ల గురించి వివరాలు సేకరించారు. రక్తనిధి కేంద్రంలోని ఫ్రీజర్లలో కొన్ని రక్త ప్యాకెట్లు పాడైపోయిన విషయాలను గుర్తించి వివరణ అడిగారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు బృంద సభ్యులు పేర్కొన్నారు.

అక్రమ దత్తత చట్టరీత్యా నేరం



బాపట్ల: బాపట్ల పట్టణం ఇందిరా నగర్ కాలనీ, 11వ వార్డులో నివాసం ఉంటున్న దోనేపూడి వెంకటేశ్వరమ్మ, భర్త జనార్దనరావు తమ నాలుగు నెలల బాబును ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన పేరం అల్లూరమ్మ, మురళీ దంపతులకు రూ.లక్షకు విక్రయించారు. ఈ విషయం మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఉమ దృష్టికి వచ్చింది. దీంతో వారు స్పందించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి పసుమర్తి పురుషోత్తం, బాలల సంరక్షణ అధికారి జి.కృష్ణ, సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కో–ఆర్డినేటర్ బడుగు కిషోర్ బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై బాపట్ల టౌన్ సీఐ అహ్మద్ జానీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలోనే పిల్లలను దత్తత తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమంగా దత్తత తీసుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమరేశ్వరునికి లక్ష బిళ్వార్చన



అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం లోక కళ్యాణార్థం లక్ష బిళ్వార్చన నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన శృంగేరిపీఠం ఆస్తుల పరిరక్షణాధికారి వేమూరి రామం ఆధ్వర్యంలో తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి,రుద్ర హోమం నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు.

క్లుప్తంగా

రేపటి నుంచి పశుగణన ప్రారంభం

వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు

నరసరావుపేట: పశుగణన జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, హౌస్‌హోల్డ్ స్టిక్కర్లు, వాస్‌పోస్టర్లు, మాన్యువల్స్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని 365 రెవెన్యూ గ్రామాల్లోని 239 వార్డుల్లోని 5,55,158 గృహాల్లో 234 మంది ఎన్యుమరేటర్లు పశుగణన చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్, నల్లపాటి రాము, పాల్గొన్నారు.

ఏఐపై అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

తెనాలి: హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న ఏకైక 'మానవ రక్షణ అధ్యయన సంస్థ' (సీహెచ్ ఎస్ఎస్) వ్యవస్థాపకుడు/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కన్నెగంటి రమేష్‌కు అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం లభించింది. ఆ యూనివర్సిటీ హ్యూమన్ సెంటర్డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (హెచ్ఏఐ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీనుంచి మూడురోజులపాటు జరగనున్న ఈ సదస్సు ప్రత్యేకించి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు సంబంధించినది. కృత్రిమ మేధతో స్మార్ట్ పోలీసింగ్, ఓడరేవుల రక్షణ అంశంపై రూపొందించిన ప్రోగ్రాంతో ప్రపంచవ్యాప్తంగా 30 సంస్థలు పాల్గొంటున్న ఆ సదస్సుకు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక సంస్థ సీహెచ్ఎస్ఎస్ ఎన్జీవో. ఈసందర్భంగా బుధవారం డాక్టర్ రమేష్‌కు జన్మస్థలి తెనాలిలో ఆత్మీయ సత్కారం చేశారు. స్థానిక ముత్యంశెట్టిపాలెంలో ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడైన డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి చేతుల మీదుగా ఈ సత్కారం చేశారు. నానాటికీ విస్తరిస్తున్న టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కు ఇప్పుడు ప్రాధాన్యత పెరిగిందని డాక్టర్ బాబు గుర్తుచేశారు. భవిష్యత్ ప్రాధాన్యతలను గుర్తెరిగి ఏఐలో అద్భుతమైన కార్యక్రమం రూపకల్పన చేసిన డాక్టర్ కన్నెగంటి రమేష్ అభినందనీయుడుగా చెప్పారు. సత్కార గ్రహీత డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, థింక్ ట్యాంక్‌గా పనిచేస్తున్న తమ సంస్థ విద్య, వైద్యం, అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలు అంశాలపై లాభాపేక్ష లేని ఎన్జీఓగా పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 'అరసం' జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్‌హకీంజాని తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేషగిరిరావు, వెనుక నిందితుడు నిందితుడు కండే ప్రసాదు

మార్టూరు: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళను హత్య చేసి పారిపోయిన నిందితుడిని మార్టూరు పోలీసులు 48 గంటల్లో అరెస్టు చేశారు. సీఐ మద్దినేని శేషగిరిరావు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించారు. మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన సూరేపల్లి నాగరాజు కుమార్తె నాగండ్ల మేరీ (27) భర్తతో విభేదాల కారణంగా గత రెండు సంవత్సరాల నుంచి తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. మేరీకి ఇద్దరు సంతానం. ఈ క్రమంలో పొగాకు కూలీ పనుల నిమిత్తం మేరీ ఆమె తల్లిదండ్రులతో కలిసి గత సంవత్సరం నెల్లూరు జిల్లా డీసీ పల్లి వెళ్ళింది. అక్కడ కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన కండే ప్రసాదు అనే వ్యక్తితో పరిచయమై వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇద్దరూ కలిసి వేరే ప్రాంతానికి వెళ్లి కొంతకాలం సహజీవనం చేశారు. కాగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మేరీ తండ్రి నాగరాజు ఇటీవల తన కుటుంబంతో మార్టూరు మండలం డేగరమూడి గ్రామానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తండ్రి అనారోగ్యం కారణంగా ప్రసాదును వదిలి తండ్రి వద్దకు వచ్చిన మేరీని.. తిరిగి తన వద్దకు రావాలని ప్రసాదు హెచ్చరించసాగాడు. ఈ క్రమంలో గత ఆదివారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో మేరీ వద్దకు వచ్చిన కండే ప్రసాదు.. తనతో తెచ్చుకున్న కత్తితో ఆమె మెడ, కడుపు, వీపు, చేతులపై విచక్షణారహితంగా నరికి పారిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న మేరీని అదే రోజు రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మేరీ తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న సీఐ శేషగిరి రావు నిందితుడు ప్రసాద్ ఆచూకీ కోసం సిబ్బందిని పలు బృందాలుగా పంపించారు. బుధవారం ఉదయం మేదరమెట్ల సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద నిందితుడు ప్రసాద్‌ని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని అద్దంకి కోర్టుకి హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించారు. నిందితుడిని రెండు రోజుల్లోనే అరెస్టు చేసిన సీఐ శేషగిరిరావు బృందం గరుత్మంతుడు, పులి ఆంజనేయులు, కోటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తదితరులను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాలి

ఏపీఎంను కోరిన యానిమేటర్


విధుల్లోకి తీసుకోవాల ఏపీఎం శ్రీమన్నారాయణను కోరుతున్న యానిమేటర్ సుజాత

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల సమాఖ్య పరిధిలోని ఐలవరం యానిమేటర్‌గా పనిచేస్తున్న మాచర్ల సుజాత తనను అకారణంగా విధుల నుంచి తొలగించడంపై హైకోర్టును ఆశ్రయించింది. ఆమెను విధుల్లోకి తీసుకోవాలని తాజాగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఐలవరం గ్రామ సంఘం కార్యనిర్వాహక సమావేశం నిర్వహిస్తున్నారని తెలిసి సుజాత ఏపీఎం శ్రీమన్నారాయణను కలసి కోర్టు ఉత్తర్వులు చూపింది. ఈ విషయం తన పరిధిలోనిది కాదని ఏపీఎం తప్పకొనే ప్రయత్నం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాల్సిన సమావేశం ఒంటి గంటకు మార్చారాని తెలుసుకుని సుజాత అక్కడికి చేరుకుని ఏపీఎంను మళ్లీ ప్రశ్నించారు. సుజాత మాట్లాడుతూ గత జూలై 30వ తేదీన ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఏపీఎం జి. శ్రీమన్నారాయణ తనను తొలగించారన్నారు. గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా పని చేశానని ఇలా అకస్మాత్తుగా తనను ఉద్యోగం నుంచి తొలగిస్తే కుటుంబం పరిస్థితి ఏంటని వాపోయారు. కోర్టు ఉత్తర్వులు ప్రకారం యథావిధిగా తనను ఉద్యోగంలోకి తీసుకోవాలని, జీతాలు ఇప్పించి జీవనాధారం కల్పించి న్యాయం చేయాలని ఆమె వేడుకుంది. అదేవిధంగా మరో నలుగురికి కూడా కోర్టు ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయమై ఏపీఎం జి. శ్రీమన్నారాయణను వివరణ కోరగా యానిమేటర్ నియామకం, తొలగింపు కానీ మండల సమాఖ్య సిబ్బందికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఆ గ్రామ సంఘం కార్యనిర్వాహక సభ్యుల అభీష్టం మేరకు తొలగింపులు, చేరికలకు సంబంధించి నిర్ణయాధికారం వారికే ఉంటుందని చెప్పారు. ఇందులో తమ ప్రమేయం కాని, పాత్రకానీ ఉండదన్నారు. ఎంపిక చేసిన వారిచే పనులు చేయించుకునే అధికారం మాత్రమే తమకు ఉందని అన్నారు.

ప్రైవేటు వసతి గృహంలో చోరీ

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తుళ్లూరు పోలీసులు

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో సూర్య ప్రైవేటు వసతి గృహంలో ఐదు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు దొంగిలించారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు ఎస్ఐ జి.అంకమ్మ తెలిపారు. వీఐటీ ఏపీ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు చెందిన ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుద్యోగిపై టీడీపీ నాయకుల వేధింపులు

ముప్పాళ్ల: 'నువ్వు టీడీపీ ఐనా సరే నన్ను ముందు అడగలేదు కాబట్టి నీ పోస్టు తీసేయ్యాల్సిందేనంటూ' మండల కేంద్రమైన ఎస్సీ కాలనీకి చెందిన ఓ చిరుద్యోగిపై టీడీపీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. వివరాలు.. సుమారు నాలుగేళ్ల క్రితం ప్రమాదవశాత్తూ భర్త మృతి చెందాడు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవటంతో ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గోళ్లపాడులోని కేజీబీవీ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నెలకు రూ.8వేలు అందేలా స్వీపరు పోస్టు ఇప్పించి అండగా నిలిచారు. వచ్చిన ఆదాయంతో ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ పోస్టుపై టీడీపీ శ్రేణులు కన్నుపడింది. తాను, తన కుంటుంబం అంతా టీడీపీ అభిమానులమేనని సదరు మహిళ టీడీపీ ముఖ్య నాయకులకు చెప్పినా కూడా వినకుండా పోస్టు తొలగించాల్సిందేనని స్థానిక నాయకులు పట్టుబట్టారు. మీరు టీడీపీ అనే విషయం తమకు ముందే చెప్పాలి కదా అంటూ మరో టీడీపీ నాయకుడు ఆమె ముందే చెప్పటంతో పోస్టు పోతుందని, తమ పిల్లలను ఆలనా పాలనా ఎలా అంటూ ఆందోళన చెందుతుంది.

బైపాస్ రోడ్డెక్కిన మొసలి



పిడుగురాళ్ల: పట్టణంలోని బైపాస్‌పై బుధవారం తెల్లవారుజామున మొసలి రోడెక్కింది. లారీలకు, వాహనదారులకు రోడ్డుకు అడ్డంగా మొసలి కనిపించటంతో వాహనదారులు బెంబేలు ఎత్తారు. దీంతో కొంత సమయం పాటు వాహనాలు నిలిపివేశారు. రోడ్డు బైపాస్ రోడ్డు దాటి మడుగులోకి వెళ్లటంతో వాహనాలు యథావిధిగా వెళ్లారు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ వీరేశలింగంతోపాటు సిబ్బంది హాజరై మొసలి తిరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మొసలి ఆచూకీ దొరకపోవటంతో ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకునేందుకు బైపాస్ రోడ్డులోని రిక్షా కాలనీ సమీపంలో మడుగు ఉన్న ప్రాంతంలో ట్రాప్ గేజ్‌ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

పంట నష్టపరిహారంలో రూ.17.50లక్షల కుంభకోణం

- అనర్హులకు కేటాయించిన అధికారులు
- దర్యాప్తు చేసి నగదు రాబట్టిన ఉన్నతాధికారులు


మేడికొండూరులో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

మేడికొండూరు: మేడికొండూరు మండల పరిధిలోని వెలవర్తిపాడు మేడికొండూరు, సిరిపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన 108 మంది రైతులను గుర్తించి 265 ఎకరాల్లో పత్తి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ. 26.50 లక్షలు నష్టపరిహారం మంజూరు చేసింది. మంజూరు చేసిన మొత్తం సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో కాకుండా అనర్హులకు కేటాయించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా అధికారులు విచారించగా విస్తుపోయే వాస్తవాలు బయటకు వచ్చాయి. వెలవర్తిపాడు, మేడికొండూరు, సిరిపురం గ్రామాల్లో రూ. 17.50లక్షల కుంభకోణం జరిగినట్లు అధికారులు నివేదికలో వెల్లడించారు. వివిధ ఖాతాల్లోకి జమ అయిన సొమ్మును అధికారులు రాబట్టారు. 41 మంది రైతుల వద్ద నుంచి అనర్హులకు కేటాయించిన నగదును జిల్లా అధికారులు వారం రోజులుగా విచారణ చేసి రికవరీ చేశారు.

- కొల్లూరు గౌడపాలెంలో ఆందోళనకు దిగిన మహిళలు
- మూడు గంటలపాటు రేపల్లె–తెనాలి రహదారిపై ధర్నా

జనావాసాల నడుమ

మద్యం దుకాణమా?


కొల్లూరులో తెనాలి-రేపల్లె రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న మహిళలు


ఆందోళన చేస్తున్న మహిళలతో చర్చిస్తున్న ఎక్సైజ్ సీఐ, వేమూరు సీఐలు

కొల్లూరు: గృహాల నడుమ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. కొల్లూరు గౌడపాలెం గుంటపునుగులు చెట్టు ప్రాంతంలో బుధవారం నూతనంగా మద్యం దుకాణం ఏర్పాట్లు చేపట్టారు. కొల్లూరు లాక్‌సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాన్ని నిర్వాహకులు గౌడపాలెం ప్రాంతానికి తరలించి అమ్మకాలకు సిద్ధం అవడంతో మహిళలు ఆందోళనకు దిగారు. స్థానికుల కథనం మేరకు.. గౌడపాలెం ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల, పలు దేవాలయాలు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు సిద్ధపడడంతో గ్రామంలోని మహిళలు ఆందోళన చేపట్టారు. మద్యం దుకాణం తరలించాలని తెనాలి–రేపల్లె రహదారిపై ధర్నా నిర్వహించారు. సుమారు మూడు గంటలపాటు రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. స్థానిక పోలీసులు ఆందోళనను విరమింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ మద్యం దుకాణం మూసివేసి ఆప్రాంతం నుంచి తరలించే వరకు ధర్నాను విరమించేది లేదని మహిళలు తేల్చిచెప్పడంతో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తరలించారు. భారీగా తరలివచ్చిన మహిళలు ఆందోళన తీవ్రతరం చేయడంతో పాటు, మద్యం దుకాణం తొలగించాలని నిర్వాహకులతో వాగ్వివాదనకు దిగారు. ఈనేపథ్యంలో వేమూరు ఎక్సైజ్ సీఐ రవికుమార్, వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని ధర్నాను విరమింపజేసేందుకు ప్రయత్నించారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ధర్నాను విరమించని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో మహిళల నుంచి పెద్దపెట్టున ఆగ్రహం వ్యక్తమయ్యింది. మద్యం దుకాణం కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఆందోళన చేస్తుంటే కేసులు నమోదు చేస్తామనడంపై మహిళలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు, మద్యం దుకాణం మూసివేసే వరకు ఆందోళన విరమించేది లేదని పట్టుపట్టారు. దీనితో ఎక్సైజ్ సీఐ, వేమూరు సీఐలు మద్యం దుకాణం తెరవరని, తాము హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.


అండర్-14 విభాగంలో ఎంపికైన ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు


అండర్ -17 విభాగంలో ఎంపికైన బాలికల జట్టు

ఉమ్మడి ప్రకాశం ఖోఖో జట్ల ఎంపిక పూర్తి

జె.పంగులూరు: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ -14, అండర్ -17 విభాగాల్లో బాలబాలికల ఖోఖో జట్లు ఎంపిక జరిగింది. ఈ ఎంపికకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి 200 పైగా బాలబాలికలు హాజరైనట్లు ఏపీ ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. వీరిలో మంచి ప్రతిభ కనపరిచిన అండర్ -14 విభాగంలో బాలబాలికలు, అండర్ -17 విభాగంలో బాలబాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. 4 టీంలకు గానూ 48 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో వారి సహకారంతో జరిగిందని తెలిపారు. జిల్లా కార్యదర్శి బి.కాశీవిశ్వనాథ రెడ్డి, పీడీలు కె.హనుమంతురావు, రఘుబాబు, పీఈటీలు సావిత్రమ్మ, రమాదేవిలు, ప్రకాశం జిల్లా ఖోఖో కోచ్ డి.లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ హజీర్‌బేగం, కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి, రావూరి రమేష్, వీరరాఘవయ్య, వై.శివనయ్య తదితరులు పాల్గొన్నారు.

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు.

సమావేశాలు జరిగే ప్రాంతాలు..

- **గుంటూరు జిల్లా:** పేరేచర్లలోని జోసిల్ కంపెనీ
- **పల్నాడు జిల్లా:** చిలకలూరిపేటలోని సెయింట్ జేవీయర్స్ గ్లోబల్ స్కూల్
- **బాపట్ల జిల్లావాసులకు:** పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రు గ్రామంలోని డాన్ బాస్కో ఇంగ్లిష్ మీడియం స్కూల్
- **కృష్ణాజిల్లా:** బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్
- **ఎన్టీఆర్ జిల్లా:** విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలోని ఆయుష్ ఎన్నారై ఎల్ఈపీఎల్ హెల్త్‌కేర్
- **ప్రకాశం జిల్లా:** పొదిలిలోని వివేకానంద జూనియర్ కళాశాల

సహానా మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

సహానా మృతదేహన్ని పరిశీలించిన సీపీఐ నాయకులు


మృతురాలు సహానా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముప్పాళ్ల, జంగాల తదితరులు

లక్ష్మీపురం: టీడీపీ కార్యకర్త, రౌడీషీటర్ నవీన్ చేతిలో అత్యంత పాశవికంగా లైంగిక వేధింపులకు గురై, గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సహానా కుటుంబానికి సీపీఐ పూర్తి సహకారం అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సహానా కుటుంబాన్ని సీపీఐ నాయకులు బుధవారం పరామర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాధిత సహనా మృతికి కారుకులైన నవీన్, అతని మిత్రులు, ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతూ ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత సహనా కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు అరుణ్ తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్ నవీన్‌ను కఠినంగా శిక్షించాలి

- సీఐటీయూ నాయకుడు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు
- తాడికొండలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన


బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన నిర్వహిస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

తాడికొండ: తెనాలిలో సహానా మృతికి కారకుడైన రౌడీషీటర్ రాగి నవీన్‌ను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావులు డిమాండ్ చేశారు. సహానా మృతిని నిరసిస్తూ తాడికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని సమాజంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయని కారణంగానే రాష్ట్రంలో సంఘ విద్రోహ శక్తులు, యువకులు రెచ్చిపోతున్నారని యువతి కుటుంబానికి న్యాయం జరిగేలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం మానవ హారంగా నిలిచి రెండు నిముషాలు మౌనం పాటించారు. డి.శ్యామ్యూల్, రేపూడి శ్రీనివాసరావు, సంకూరి రాజు, షేక్ సుభాని, నూతక్కి వీరయ్య, కుక్కమళ్ళ జగ్జీవన్‌రామ్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలు చిత్తూరు, గుంటూరు

- రాష్ట్రస్థాయి అండర్–17 బాలుర పోటీల్లో గుంటూరుపై చిత్తూరు గెలుపు
- బాలికల విభాగంలో చిత్తూరుపై విజయం సాధించిన గుంటూరు జట్టు


బాలికల విభాగంలో మొదటి స్థానం దక్కించుకున్న గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముదిరెడ్డిపల్లిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల వాలీబాల్ టోర్నీ విజేతగా చిత్తూరు, గుంటూరు జట్లు నిలిచాయి. మూడు రోజులపాటు సాగిన ఈ పోటీలు బుధవారం ముగిశాయి. చివరి రోజు బుధవారం బాలుర విభాగం సెమీఫైనల్స్ జరిగాయి. ఇందులో విశాఖపై గుంటూరు, శ్రీకాకుళంపై చిత్తూరు జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. అనంతరం హోరీహోరీగా సాగిన ఫైనల్ పోటీలో గుంటూరుపై చిత్తూరు జట్టు గెలిచి మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో విశాఖ, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచాయి.

బాలికల విజేత గుంటూరు..

బాలికల విభాగంలో అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు జట్లు సెమీఫైనల్‌కు చేరుకోగా, తొలి సెమీఫైనల్‌లో ప్రకాశంపై చిత్తూరు జట్టు, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంపై గుంటూరు జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరుపై గుంటూరు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో అనంతపురం, నాల్గో స్థానంలో ప్రకాశం జట్లు నిలిచాయి. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, హెచ్ఎం సుధామణి, టోర్నీ అబ్జర్వర్ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మొరార్జీ యాదవ్, ముదిరెడ్డిపల్లి వాసులు మంజునాథ్, బండారు బాలాజీ, మంచాల మారుతి, పల్లా లక్ష్మీ కుమార్, ఏసీ నాగరాజు, ఓబులేసు, పామిశెట్టి శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, పీఈటీలు రామాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.